# క్లాస్

ఎస్.వి.సుబ్బారావు

"ప్రక్క పోర్షన్‌లోకి ఎవరో దిగారండీ" ఆఫీసు నుండి వచ్చిన భర్తకు టీ అందిస్తూ అంది ఆదిలక్ష్మి. "ఇంకేం, వంటరిగా ఏమీ తోచటం లేదంటున్నావుగా మంచి కాలక్షేపం. రేపటి నుండి ఇంటికి రాగానే దేవిగార్ని ఎక్కడ వెతుక్కోవాలో ?" అంటూ దగ్గరకు తీసుకోబోయాడు విష్ణుమూర్తి.

"చాల్లెండి వెటకారం. ఆయన సూపర్‌వైజర్ అట. ఇద్దరు పిల్లలు. భార్యా భర్తలు స్కూటర్ మీద వెళుతుంటే ఎంత ముచ్చటగా వుందో. మీరూ వున్నారు" ఆ 'మీరూ వున్నారు' అనే తన వూతపదం పదేపదే వల్లిస్తూ కొత్తగా వచ్చినవారిని గూర్చి చిలువలు పలవలుగా వర్ణించి చెప్పిం యిల్లాలు.

విషమూర్తి ఎం.ఏ. పాసయ్యాడన్నా. గజిటెడ్ హోదా ఉద్యోగం చేస్తున్నాడన్నా ఎవరూ నమ్మరు. రిక్షావాలా కూడా పోలిష్డ్ దుస్తులు ధరించాలని తాపత్రయం పడుతున్న ఈ రోజుల్లో. ఖద్దరు బట్టలు కట్టుకునే ఛాందసుడు. ఆఫీసుకు నడిచివెళ్ళి రావటం అతనికి సరదా ! ఈ విధంగానైనా మనిషికి కనీస వ్యాయామం చేసే అవకాశం కలుగుతుందని అతని ఉద్దేశం.

"ఏమండీ !"

ప్రక్కవాళ్ళెవరో పిలవడంతో లోనికి వెళ్ళింది శ్రీమతి.

"మీ చేద ఒకసారి యిస్తారా, నీళ్ళు

---

'హైక్లాసు' మనుషుల ప్రవర్తన చూసయినా 'క్లాసు'కు అర్థం మార్చుకోవాలేమో!


---

తోడుకుని యిస్తాం" ప్రక్క పోర్షన్‌లో కొత్తగాదిగిన వారి పనిమనిషికాబోలు అడిగింది.

"దానికేం, అలాగే" అంటూ "పంపు నీళ్ళుకూడా కావాలేమో తీసుకెళ్ళు" అని ఒక బిందె మంచినీళ్ళుకూడాఅందించింది.

తల్లిదండ్రులకు ఒక్కతేకూతురవటం వలన గారాబంగా పెరిగింది ఆదిలక్ష్మి. తానెక్కువ చదువుకోపోయినా, చక్కని సంబంధం కుదిరి. విద్యావంతుడైన విషమూర్తితో వివాహమయినాక, ఏ చీకూ చింతా లేదుగాని, భర్త ఫాషన్‌బుల్‌గా వుండడని.సినిమాలకి, షికార్లకి వుత్సుకత చూపడని లోపల దిగులు. తీరిక వేళల్లో చదువుకోవడం. రాసుకోవడం అతని హాబీ. అయితే మారుతున్న నేటి సమాజంలో వెనుకబడుతున్నామేమోనని ఆమె ఆవేదన.

ఒక రోజు ఆఫీసునుండి రాగానే మంచి నీళ్ళ గ్లాసు అందించింది భర్తకు ఆదిలక్ష్మి. వేసవి కాలమేమో నీళ్ళు చల్లగా వుండటంతో గ్లాసు ఖాళీ చేశాడు మూర్తి.



డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010.

SUVARNA

# కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు

శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

ఇంత చల్లని ఐస్‌వాటర్ ఎక్కడివబ్బా అనుకొని ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీమతి వంక. చూశారా నా ప్రజ్ఞ అన్నట్లు ముసి ముసి నవ్వులు నవ్వుకుంది ఆమె. "ప్రక్క వాళ్ళ ఫ్రిజ్‌లో నీళ్ళండీ!" అంటూ సస్పెన్సు తొలగించి. "మీరూ వున్నారు ఎందుకూ?" అంటూ ప్రారంభించింది! వారికున్న ఫ్రిజ్, సోఫాసెట్, డైనింగ్ టేబులు, గ్రైండర్ మొదలైన ఆధునిక సామాగ్రిని విశదీకరించి, వర్ణించి వాటిని వారు సర్దుకున్న తీరుతోసహా వివరించింది.

"ఏమండీ మీ చీపురుకట్ట ఒకసారి యిస్తారూ" అంటూ వచ్చింది ప్రక్కవాళ్ళ పనిమనిషి.

"అలాగే తీసుకువెళ్ళు" అంటూ కుంచె చీపురు అందించింది. కాని ఆమె కూడా ఈసారి ఆలోచనలో పడక తప్పలేదు. చేదకు ప్రతిరోజూ వస్తూనే వున్నారు. నిన్న కత్తిపీట అడిగారు. ఇన్ని ఆధునిక పరికరాలు వున్నవాళ్ళు నిత్యావసర వస్తువుల విషయంలో ఎందుకింత అశ్రద్ధగా వుంటారో అర్థం కాలేదు తనకు.


తన సంసార అవసరాల విషయంలో ఆమె నిశ్చింతగా వుంటుంది. చెప్పినా, చెప్పకపోయినా ఎప్పటికేది అవసరమోనని, ఒకటికి రెండు తెచ్చిపడేస్తాడు తన భర్త. ఇంటి పరికరాలలోను, పరిసరాలు శుభ్రంగా వుంచటంలోను ఆయనకెంతో శ్రద్ధ.

"అత్తయ్యగారూ, మీ పెన్ను ఒకసారి యిస్తారా ఉత్తరం రాసి యిస్తాం, తెమ్మంది అమ్మ" పక్కింటివాళ్ళ అమ్మాయి వచ్చి అడిగింది. దినుసుల పేర్లు వ్రాసి డబ్బాలపై లేబుల్స్ అతికించుకోవటానికి, చాకలి పద్దులు, ముగ్గులు వగైరా రాసుకోటానికి తనకు ప్రత్యేకించి కేటాయించిన పెన్ను వెతికి యిచ్చింది. ఆదిలక్ష్మి ఆలోచలో పడింది. తమ ఇంట్లో కూడా ఒకరిపెన్ను మరొకరు ముట్టుకోరు. అగ్గిపెట్టె నుండి యిస్త్రీపెట్టె వరకు ప్రక్కవారిమీద ఆధారపడే ఎంతో మంది బయటకువెళితే బడాయి ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. భావుకుడైన తన భర్త చెప్పే మాటలు పదేపదే గుర్తుకు రాసాగాయి.

సమాజంలో ఉన్నత వర్గానికి చెందినవారిమనే భావం పదిమందికి కలిగించాలనే ఉద్దేశంతో ప్రజ్ఞకు ప్రాకులాడేవారెంతోమంది వున్నారు. ఈ భావదాస్యం ఎంతవరకు పోయిందంటే చదువుకున్నవారు సైతం విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమైన అవాస్తవిక విషయాలను నమ్ముతున్నారు. అసంఖ్యాకులైన సామాన్య ప్రజలు చేసే పని 'మాస్', డబ్బు వెచ్చించి కొద్దిమంది మాత్రమే చేయగలిగిన పని 'క్లాస్' అని వీరి భావన. దైనందిన కార్యక్రమంలో కూడా ఈ భావంతోనే ఎంతో మంది పప్పులో కాలు వేసుంటారు.

కాబేజి తినటం క్లాసు- గోంగూర తినటం మాసు; జీడిపప్పు తినటం క్లాసు- వేరుశనగపప్పు తినటం మాసు. ఆపిల్ పండు తినటం క్లాసు- జామపండు తినటం మాసు. యిలా వుంటాయి వీళ్ళ వుద్దేశాలు.

వీధిగేటు తీసిన చప్పుడవటంతో అటు చూసింది ఆదిలక్ష్మి. ఎవరో గేటు తీసుకుని ప్రక్క వాటాలోకి వెళ్ళారు. టెర్లిన్ బట్టలు వేసుకుని చూడటానికి చదువుకున్నవాడిలానే వున్నాడు. తీసిన గేటు మాత్రం



మరల దగ్గరకు వేయలేదు. పంది గేటు సందులోనుండి లోనికి రావటానికి ప్రయత్నిస్తున్నది. ప్రక్కవాళ్ళు వచ్చిన దగ్గర నుండి గేటువేసే ఉద్యోగం ఎక్కువయింది. ఈమాత్రం యింగితజ్ఞానం చదువుకున్న వాళ్ళకుకూడా ఎందుకుండదో ఆశ్చర్యమే!

"ఏమండి మీకు కొబ్బరికోరు వుంటే ఒకసారి యిస్తారు" పక్కవాళ్ళ పనిమనిషి వచ్చి అడిగింది. ఆదిలక్ష్మి కొంచెం సందిగ్ధంలో పడింది. తీసుకున్న వస్తువు మరల పని అయిన వెంటనే తెచ్చియిచ్చే అలవాటు లేదు. లేదని చెబుదామనుకుంది కాని, చెప్పలేకపోయింది. పైన అటకమీద సర్దించింది ప్రయాసపడి తీసిచ్చింది.

రోజూమల్లేనే భోజనాలయినాక వీక్లీ తిరగేస్తున్నది ఆదిలక్ష్మి. ఏదో వ్రాసుకుంటున్నాడు విష్ణుమూర్తి. ప్రక్క వాటాలోని రేడియో వినిపిస్తున్న వివిధభారతి వాణిజ్య ప్రకటనల సౌండు పెరగటంతో వారికి మూడ్ డిస్టర్బయింది.

"వాళ్ళకుండాలిగాని రేడియో సౌండు తగ్గించి పెట్టుకోమని సాటివాళ్ళకేమని చెబుతాం?" అంటూ యిల్లాలు ప్రారంభించటంతో చర్చ అటు మళ్ళింది.

"ఏమిటటా ప్రక్కవాళ్ళ విశేషాలు?" అంటూ కూపీ లాగడానికి ప్రయత్నించాడు మూర్తి. "ఏముందండి సినిమాలు, షికార్లు. వాళ్ళకేదైనా అవసరముంటేనే మాట్లాడుతారు. పోనిద్దురు" అని. "ఏమండోయ్ యిది విన్నారా, ఆయన తాగివచ్చి ఆమెను చితకబాదుతాడట!"

"క్లబ్బులకు వెళ్ళటం హోదాగాను, మత్తు పానీయాలు సేవించటం మర్యాదగాను చెలామణి అవుతున్న సమాజంలో జీవిస్తున్నాం మనం మరి" విష్ణుమూర్తి వివరించసాగాడు.

"ఎక్కువమంది ఆచరిస్తున్నది. అది చెడని అంతరాత్మ చెబుతున్నా, సంఘాన్ని ఎదిరించడానికి దమ్ములు చాలక, అనుసరిస్తున్నాడు ఒక వ్యక్తి. ఇది మంచిది, ఆచరణ యోగ్యమైనదని తెలిసినా ఒకడిగా చేయవలసివస్తే పరిహాసం చేసే సంఘాన్ని చూసి బేజారెత్తిపోతున్నాడు. మరొక వ్యక్తి. కొంచెం శ్రమతో కూడిన పనైనా తన కాళ్ళమీద నిలదొక్కుకునే ఆస్కారం వున్నా, అలాగాక, ప్రవాహంలోపడి కొట్టుకుపోవటమే సునాయాసంగా భావిస్తున్నాడు యింకొక వ్యక్తి" యిలా సాగిన భర్త వుపన్యాసానికి పరవశించిపోవటం ఆమెవంతయింది.

ఒకరోజు ప్రొద్దున్నే పక్కవాళ్ళ పనిమనిషి "మా అమ్మగారు ఎక్కడకు వెళ్ళేరండి తాళం వేసివుంది" అంటూ వచ్చింది. ఆదిలక్ష్మి ఆశ్చర్యంతో బయటకు వెళ్ళి చూడగా పేపరు చూస్తున్న మూర్తి "అవునోయ్ రాత్రేదో లారీ ఆగిన చప్పుడయింది" గుర్తు తెచ్చుకుంటూ అన్నాడు. ఇంతలోనే యింటి యజమాని గుమాస్తా 'ఇల్లు అద్దెకు యివ్వబడును' బోర్డు తెచ్చి తగిలించాడు. అందరి అనుమానాలు నివృత్తి అయినాయి.

"నా జీతం డబ్బులు పది రూపాయలు యివ్వకుండా పోయేరు. పెద్దోళ్ళు బాగుపడతారా?" అంటూ గొణుక్కుంటూ పోయింది పనిమనిషి.

"నా దగ్గర చేబదులు పాతిక రూపాయలు తీసుకుందండి ఆవిడ" అసలు రహస్యం బయటపెట్టింది ఆదిలక్ష్మి.

"ఈ రోజులలో అంతే....మీరూ వున్నారంటూ వెనకేసుకొచ్చేదానివిగా? చూశావా? క్లాసు మనుషులు కదా మరి!" అంటూ వూరడించడం మూర్తిపనయింది.

★




తెల్ల మచ్చల వైద్యం
వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇది అంత ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవటం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అవి ఎంత బాగా తెలిసేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం సంబంధుము ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)